అందుబాటులో ఉన్నా అందని సేవలు

- యూపీహెచ్‌సీలో అల్ట్రా స్కానింగ్ మిషన్ ఉన్నా..
- ఇబ్బందులుపడుతున్న రోగులు
- అధికారులు స్పందించాలని వినతి



శేరిలింగంపల్లిలోని యూపీహెచ్‌సీ ఆస్పత్రి భవనం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీలో తెలంగాణ డయాగ్నొస్టిక్స్ మినీ హబ్‌లో అల్ట్రా సౌండ్ స్కానింగ్ సేవలు అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ యూపీహెచ్‌సీ పరిధిలో గోపన్‌పల్లి, గౌలిదొడ్డి, నెహ్రూనగర్, పాపిరెడ్డి కాలనీ, గంగారం, ఇందిరానగర్, వేమన కాలనీ, మధురానగర్‌ల్లో బస్తీ దవాఖానాలున్నాయి. ఇక్కడ నుంచికూడా రోగులను పరీక్షల కోసం ఈ ఆస్పత్రికే పంపిస్తారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలో ఆ ఆస్పత్రికి మంచి గుర్తింపు కూడా ఉండడంతో దీని ప్రాధాన్యత రోజు రోజుకూ పెరుగుతోంది. ఆధునిక సౌకర్యాలు రోగులకు అందుబాటులోకి తేవడంలో ఆలస్యంపై రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఎదురుచూసిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రం వచ్చినా సేవలు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఈ ఆస్పత్రిలో గత ఏడాది మే 11వ తేదీన తెలంగాణ డయాగ్నొస్టిక్స్ మినీ హబ్‌ను ప్రారంభించారు.
- ఈ సందర్భంగా ఎక్స్‌రే, ఈసీజీ, అల్ట్రా సౌండ్ స్కానింగ్‌లతో రేడియాలజీ విభాగం, 57 రకాల పరీక్షలు చేయడంకోసం ల్యాబ్ ఏర్పాటు చేశారు. కానీ రేడియాలజీ విభాగంలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలు మాత్రం ఇంకా అందుబాటులోకి రాలేదు
- దీంతో గర్భిణులు ప్రయాసలతో ఇతర ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది
- ముఖ్యంగా గర్భిణులకు అవసరాన్ని బట్టి రెండు నుంచి మూడుసార్లు అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేస్తారు. బయట స్కానింగ్ చేసేందుకు రూ.800, రూ 1000 వరకు చెల్లించాల్సి వస్తోంది. దీంతో పేద మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు.
- ఈ విభాగంలో అవసరమైన సిబ్బందిని నియమించి అల్ట్రాసౌండ్ సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు.



అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్

ప్రపంచ పోకడలను అధ్యయనం చేయాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ప్రొ.జీవీఆర్‌కే ఆచార్యులు

రాయదుర్గం: మేనేజ్‌మెంట్ కోర్సు చదివే విద్యార్థులు గ్లోబల్ మేనేజర్లుగా ఎదగాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ జీవీఆర్‌కే ఆచార్యులు సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని బిజినెస్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో గోల్డెన్ జూబ్లీ వేడుకలలో భాగంగా గోపన్‌పల్లిలోని సెయింట్ జేవియర్స్ పీజీ కళాశాల ఆధ్వర్యంలో 'గ్లోబల్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్‌లో ఆధునిక పోకడలు' అనే అంశంపై జాతీయ సదస్సును ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో విద్యార్థులు వర్చువల్ మోడ్‌లో చదువుకోవచ్చన్నారు. టెక్నాలజీ ఆధారిత పరిశ్రమలలో ప్రపంచ పోకడలను అధ్యయనం చేయాలని, అందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ చంద్రమౌళి మాట్లాడారు. హెచ్‌ఓడీ ప్రొఫెసర్ టి రవి మాట్లాడుతూ నిర్ణయం, అమ్మకాలు, మార్కెట్, బ్యాంకింగ్ రంగం, కస్టమర్ సేవ వంటి నిర్వహణ రంగంలో కృత్రిమ మేధస్సు యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం ప్రొఫెసర్ ఆచార్యులు, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ చంద్రమౌళి చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సెయింట్ జేవియర్స్ పీజీ కళాశాల కరస్పాండెంట్ కె సుధీర్, చైర్మన్ టి రాఘవరెడ్డి, పలువురు ఫ్యాకల్టీ సభ్యులు, అధికారులు, ఎంబీఏ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంయూఎన్‌లో శాంటామరియా విద్యార్థుల ప్రతిభ



శేరిలింగంపల్లి: తరగతి గదిని దాటి ప్రత్యేక అనుభవాలే లక్ష్యంగా ఇంటర్నేషనల్ స్కూల్స్ పార్టనర్ షిప్ ఆధ్వర్యంలో మోడల్ యునైటెడ్ నేషన్స్ (ఎంయూఎన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో శేరిలింగంపల్లిలోని శాంటామరియా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎంయూఎన్ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశంలో ప్రపంచవ్యాప్తంగా 70కిపైగా పాఠశాలలనుంచి 300 మంది విద్యార్థులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూఎన్ థీమ్ సస్టేనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ ఆధారంగా రూపొందించారు. ముఖ్యంగా డిజిటల్ విభజనను తగ్గించడం, మహిళా సాధికారత, డ్రగ్ కర్టెల్ హింసను ఎదుర్కోవడం, ఔషధ కాలుష్యంపై పోరాటం, ఆరోగ్యం, వలసదారుల భద్రత వంటి అంశాలపై విద్యార్థులు చర్చించారు. కార్యక్రమంలో శాంటా మరియా విద్యార్థి హర్షిక యూఎన్‌సీటీఏడీ కమిటీకి డయాస్ సభ్యురాలిగా ఎంపిక కావడం విశేషం. అంతర్జాతీయ స్థాయిలో పది మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు. స్కూల్ ప్రిన్సిపల్ రుచిరాఘోష్ విద్యార్థులను అభినందించారు.

క్రీడాకారులకు ఎల్లవేళలా సంపూర్ణ సహకారం



విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- ఘనంగా మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

పటాన్‌చెరు: క్రీడాభివృద్ధికి ఎల్లప్పుడూ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే, మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్రస్థాయి పదవ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మలిదశ వయసులో క్రీడలపై ఆసక్తి పెంపొందించుకొని రాష్ట్ర,జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ క్రీడాంశాల్లో ప్రతిభను కనపరచడం సంతోషకరమన్నారు.40 సంవత్సరాల వయసు నుండి 90 సంవత్సరాల వయస్సు గల క్రీడాకారులు వీటిలో పాల్గొంటున్నారని తెలిపారు.అనంతరం వివిధ క్రీడాంశాల్లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు, మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభుకుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు ఇక్బాల్, కోశాధికారి లక్ష్మి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డైమండ్‌హిల్స్ ప్లాట్ల సమస్యల పరిష్కారానికి కృషి

కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్

గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్ పరిధిలోని డైమండ్‌హిల్స్ ప్లాట్ల సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్ పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలిలో డైమండ్‌హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైమండ్‌హిల్స్‌లోని 470 ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలోనే సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. సొసైటీ అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ 37 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన ప్లాట్లపై కొందరు పట్టాదారులు సివిల్ వివాదం సృష్టించారన్నారు. ఇప్పటికే ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. గచ్చిబౌలి సర్వే నంబర్ 51, 52 ,53లోని 470 ప్లాట్లను క్రమబద్ధీకరిస్తే ప్రభుత్వ ఖజానాకు రూ.200 కోట్ల ఆదాయం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో డైమండ్‌హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, కోశాధికారి వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నర్సింహారావు తదిరులు పాల్గొన్నారు.

కిందికుంట చెరువు మురుగు సమస్యను పరిష్కరిస్తా..

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కిందికుంట చెరువులో డ్రైనేజీ నీరు చేరుతోందని కాలనీవాసులు ఇచ్చిన సమాచారం మేరకు శనివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు జీహెచ్‌యంసీ ఏఈతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిందికుంట చెరువులో డ్రైనేజీ నీరు చేరుతోందని పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయని తెలిపారు. ప్రజలు ఇబ్బంది పడకుండా యుద్ధ ప్రాతిపదికన సమస్యను పరిష్కరించాలని తెలిపారు. హైదర్‌నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌యంసీ ఏఈ రాజీవ్, సిబ్బంది, కాలనీవాసులు రావూరి శ్రీనివాస్, పెండ్యాల శ్రీను, గుంటుపల్లి శ్రీనివాస్, వంశీ, సురేష్, సంజీవరావు, సుందర్, రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టికుప్పలతో ప్రమాదాలు

- ఉపకమిషనర్ వంశీకృష్ణకు వినతి



ఉపకమిషనర్ వంశీకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న కార్తీక్‌గౌడ్

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని వేముకుంటలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు అసంపూర్తిగా ఉన్నాయని వాటిని పూర్తి చేయాలని శనివారం చందానగర్ ఉపకమిషనర్ వంశీకృష్ణకు స్థానిక నాయకులు కార్తీక్‌గౌడ్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేముకుంట వీకర్ సెక్షన్‌లో సీసీ రోడ్డు తవ్వి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం పైప్‌లైన్ వేస్తున్నారన్నారు. ఐతే తవ్విన మట్టిని తొలగించలేదన్నారు. దీంతో మట్టి కుప్పల వల్ల రాత్రి సమయాలలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

గచ్చిబౌలి: కొత్తగూడ, సఫారినగర్‌లోని న్యూబ్లూమ్స్ స్కూల్ ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. హోలిస్టిక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పరిసర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని వారు తెలిపారు.

అభినందన

రాయదుర్గం: రాష్ట్ర హోంగార్డుల గౌరవ అధ్యక్షుడు తాండూరు శాసనసభ్యులు బి మనోహర్‌రెడ్డిని రాష్ట్ర హోంగార్డుల సంఘం ప్రతినిధులు శనివారం కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు దయానంద్‌స్వామి ఆధ్వర్యంలో మనోహర్‌రెడ్డిని అభినందించారు. హోంగార్డుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా చూడాలని కోరినట్లు సైబరాబాద్ హోంగార్డుల సంఘం అధ్యక్షుడు అశోక్ కుమార్ తెలిపారు.

ఉచిత ఆపరేషన్లు

కూకట్‌పల్లి: వినికిడి లేని, మాటలు రాని చిన్నారులకు పది లక్షలు ఖరీదు చేసే కాక్లియర్ ఇంప్లాంటేషన్ ఆపరేషన్‌ను ఉచితంగా చేయనున్నట్లు డాక్టర్ రావూస్ ఇయన్‌టి హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరావు ఓ ప్రకటనలో తెలిపారు. దురదృష్టవశాత్తు కొంతమంది పిల్లలు పుట్టుకతో వినలేరు, మాట్లాడలేరని ,అటువంటి వారికి ఇకపై డాక్టర్ రావూస్ ఇఎన్‌టి హాస్పిటల్‌లో ప్రత్యేక పథకం ద్వారా ఉచిత కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీను చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9406778899 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దుప్పట్లు పంపిణీ




వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న విద్యార్థినులు

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని సంస్కృతి హైస్కూల్ విద్యార్థులు వృద్ధులకు దుప్పట్లు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. శనివారం కూకట్‌పల్లిలోని శ్రీమాతా వృద్ధాశ్రమంలో 35 మంది వృద్ధులకు బియ్యం, పప్పు, నూనె, చీరలు, నైటీలు, శాలువలు అందజేశారు. బ్రెడ్లు, భోజనం వృద్ధులకు అందజేశారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

- మాదాపూర్ ట్రాఫిక్ సీఐ నర్సయ్య



మాదాపూర్: నూతన సంవత్సర వేడుకల్లో జాగ్రత్తలు పాటించాలని ,మద్యం తాగి వాహనాలు నడపొద్దని మాదాపూర్ ట్రాఫిక్ సీఐ జి.నర్సయ్య సూచించారు. 31వ తేదీ రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5గంటల వరకు ఫ్లైఓవర్లను మూసివేయనున్నట్టు తెలిపారు. శిల్పాలేఔట్ ఫ్లైఓవర్, బయోడైవర్సిటీ ఫ్లైఓవర్లు, షేక్‌పేట్ ఫ్లైఓవర్, మైండ్‌స్పేస్ ఫ్లైఓవర్, రోడ్‌నెంబర్ 45 ఫ్లైఓవర్, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి, సైబర్‌టవర్, ఫోరమ్‌మాల్, జేఎన్‌టీయూ ఫ్లైఓవర్, ఖైత్లాపూర్, బాబుజగ్జీవన్‌రామ్ ఫ్లైఓవర్‌లను మూసివేయనున్నట్టు తెలిపారు. ఎలాంటి ప్రమాదాలు జరిగినా వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

శేరిలింగంపల్లి సమగ్రాభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే గాంధీని సత్కరించిన అసోసియేషన్ సభ్యులు

ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి నిరంతర కృషి చేస్తానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ అభినందన సమావేశంను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయనను అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐటీ కారిడార్‌లోని హాస్టళ్ళ సమస్యలను తీర్చడానికి ముందుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హాస్టల్స్ అసోసియేషన్ ప్రతినిధులు అమర్‌నాథ్ రెడ్డి, తాతా కరుణాకర్, నాగిరెడ్డి, మహేందర్, సంజయ్, వేణు, మధు,చంద్రశేఖర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా..సందడిగా



శేరిలింగంపల్లి వార్డు కార్యాలయంలో మహిళల క్యూ

గచ్చిబౌలి/రాయదుర్గం: శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో 28 కేంద్రాలలో ప్రజాపాలన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. కొన్ని కేంద్రాలు సాదాసీదాగా సాగగా మరికొన్నిచోట్ల సందడిగా కనిపించాయి. శనివారం రాయదుర్గంలోని ప్రజాపాలన కేంద్రాన్ని సీనియర్ అధికారి వాణిశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్, జంట సర్కిళ్ళ అధికారులు కూడా తమ పరిధిలోని ప్రజాపాలన కేంద్రాలను పరిశీలించారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో 9,200 దరఖాస్తులు

శేరిలింగంపల్లి: ప్రజా పాలన కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్ల పరిధిలో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా శనివారం మొత్తం 9,200 దరఖాస్తులు వచ్చాయి, అందులో 7వేల దరఖాస్తులు ఆరు గ్యారంటీల కోసం కాగా ఇతర అంశాలపై 2,200 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.

చందానగర్ సర్కిల్‌లో 8,698 దరఖాస్తులు

హఫీజ్‌పేట్: ప్రజాపాలన కార్యక్రమంలో చందానగర్ సర్కిల్ పరిధిలోని మాదాపూర్, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా శనివారం మొత్తం 8,698 దరఖాస్తులు వచ్చాయి. అందులో 6,212 దరఖాస్తులు ఆరు గ్యారంటీల కోసం కాగా, 2,486 దరఖాస్తులు ఇతర అంశాలపై ఉన్నాయి.

వెస్ట్‌జోన్ పరిధిలో మొత్తం 21,019 దరఖాస్తులు

జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి పరిధిలో శనివారం 21,019 దరఖాస్తులు వచ్చాయి. అందులో అభయహస్తం కింద 16,188 దరఖాస్తులు, 3,367 దరఖాస్తులు ఇతర అంశాలకు సంబంధించినవి ఉన్నాయి, వెస్ట్‌జోన్ పరిధిలో శేరిలింగంపల్లి, చందానగర్, యూసుఫ్‌గూడ, రామచంద్రాపురం-పటాన్‌చెరు సర్కిళ్ళ పరిధిలో డివిజన్ల వారీగా స్వీకరించిన దరఖాస్తులని అధికారులు తెలిపారు.

అందరికీ అందుబాటులో దరఖాస్తులు

భాగ్యనగర్‌కాలనీ: ప్రజా పాలన కేంద్రాల్లో అందరికీ దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఫేజ్2 కాలనీ, హైదర్‌నగర్ డివిజన్‌లోని హెచ్‌యంటిహిల్స్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరూ కూడా సెంటర్‌లకు వెళ్లి డబ్బులు ఇచ్చి దరఖాస్తులను తీసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



ప్రజాపాలన కేంద్రం వద్ద జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

లిఫ్టులు ఏర్పాటు చేయాలని వినతి

హఫీజ్‌పేట్ : చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌లో లిఫ్టులు ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులకు శనివారం మాజీ కౌన్సిలర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందానగర్ నుంచి నాంపల్లి, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. వృద్ధులు, వికలాంగులు, మహిళలు, ఆరోగ్య సమస్యలు ఉన్న వారందరికి ఒక ప్లాట్ ఫారం నుంచి మరో ప్లాట్‌ఫారంకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై వెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున రెండు ప్లాట్‌ఫారంల వైపు లిఫ్టులు ఏర్పాటు చేయాలని రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ పి.డి.మిశ్రాను కోరగా వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ప్రొ.సమర్‌కుమార్ దాస్‌కు జేసీ బోస్ ఫెలోషిప్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన సీనియర్ ప్రొఫెసర్ సమర్‌కుమార్ దాస్ ప్రతిష్టాత్మకమైన జేసీబోస్ ఫెలోషిప్‌ను అందుకున్నారు. ఆయన హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్. పునరుత్పాదక శక్తి వనరులు మన నుంచి రోజుకోజుకూ క్షీణించడమే కాదు, నేటి సమాజ అవసరాల నేపథ్యంలో స్థిరమైన/పునరుత్పాదక శక్తిని సాధించడంలో ఆయన చేసిన పరిశోధనకు ఈ ఫెలోషిప్ లభించింది. జేసీబోస్ ఫెలోషిప్ వ్యవధి అయిదేళ్లు. ఈ సందర్భంగా ఆయన్ని పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

అభయహస్తం దరఖాస్తులు బయట అమ్మితే కఠిన చర్యలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తం దరఖాస్తు ఫారాలను జిరాక్స్ కేంద్రాలు, ఇతర దుకాణాల్లో అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారాలను వార్డు అధికారులు గడపగడపకు వచ్చి ఇస్తారని చెప్పారు.ఎవరైనా బయట విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే ఆయా దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దరఖాస్తు విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ప్రజలు వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి ఒక్కరికి క్షేత్రస్థాయిలో దరఖాస్తులను అందిస్తున్నామని వివరించారు.

కనువిందు.. కథక్ నృత్యం

- నేటితో ముగియనున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళా



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళా సందర్శకులను ఆకట్టుకుంటుంది. మేళాలో భాగంగా శనివారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సంజయ్‌జోషి బృందం కథక్ నృత్యం, బెంగుళూరికి చెందిన రేఖరాజు శిష్యబృందంచే మోహినియట్టం, రాజస్థాని జానపద నృత్యాలు, కల్బేలియా, తమిళనాడు రాష్ట్రానికి చెందిన జానపద నృత్యం కర్గం, కావడి, తప్పటం నృత్యాలు ఆకట్టుకున్నాయి.

నృత్యార్చన..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా నృత్యార్చన నిర్వహించారు. లలిత ఫైన్ ఆర్ట్స్ అకాడమీ గురువు లలిత ధనలక్ష్మి శిష్యులు 30 మంది పాల్గొన్నారు. కళాకారులు సంజన ప్రియ, ఐశ్వర్య, సుధాకృతి, శర్వాణి, వర్షిత, సుదీక్ష, శెహరి, దీక్షిత, త్రివేద, లాస్య, తన్మయి, శాన్వి, సుప్రన్య, శాన్విజ, అనన్యలక్ష్మి, భావన్య, దేవైశి, నక్షత్ర తదితరులు పాల్గొన్నారు. ఇందులో వినాయకకౌతం, మూషికవాహన, కృష్ణ కలయసఖి, అష్టలక్ష్మీ స్తోత్రం, ఫరజ్‌తిల్లాన, రుక్మిణీప్రవేశం, కళ్యాణరామ, లలితాదేవి తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు

రాయదుర్గం: అయోధ్య రామాలయం అక్షింతల ఊరేగింపు కార్యక్రమాన్ని శనివారం రాత్రి టెలికామ్‌నగర్‌లో నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం నుంచి కాషాయపతాకాలతో జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీవాసులు డి రవీందర్‌రెడ్డి, దినేష్‌యాదవ్, వెంకటేష్, శివసింగ్,విఠల్, గోపాల్, స్థానికులు పాల్గొన్నారు.

రేపు గురుపాద పూజోత్సవం

కూకట్‌పల్లి: మియాపూర్‌లోని విశ్వనాథ గార్డెన్స్‌లో సోమవారం ఉదయం 8 గంటలకు భగవాన్ శ్రీ రామదూత స్వామి గురు మంత్రోపదేశం, గురు పాదపూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డీవీవీ సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖులు, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డా. వకులాభరణం కృష్ణమోహన్‌రావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానందగౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌రావు, ఉన్నతాధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వృద్ధుడు అదృశ్యం

మియాపూర్ : ఓ వృద్ధుడు ఇంటి నుండి బయకు వెళ్లి మళ్లీ తిరిగి రాని సంఘటన మియపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మియాపూర్‌లోని గోకుల్‌ప్లాట్స్‌లో ఎర్రోళ్ల చంద్రయ్య(70) కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. ఈనెల 28న మధ్యాహ్నం 12 గంటలకు ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుప్రక్కల, బంధువుల ఇళ్లల్లో ఎంత వెతికిన ఆచూకీ లభ్యం కాలేదు. ఆందోళన చెందిన కుమారుడు ఎర్రోళ్ల రవి మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

టాస్కులు, కమిషన్‌ల పేరుతో మోసం

- సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి
- రూ. 13 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్ కు స్పందించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.13 లక్షల 60 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేటకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ డిసెంబర్ 8వ తేదీన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది.దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు.దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు.దీంతో ఉద్యోగి ముందుగా రూ.3 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలు పెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.13 లక్షల 60 వేలు చెల్లించాడు. చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.